నల్ల కోడికి భలే గిరాకీ



కడక్‌నాథ్ కోడి పిల్లలు

మాంసాహార ప్రియులు సరికొత్త రుచులను ఆస్వాదిస్తుంటారు. ప్రస్తుతం కడక్‌నాథ్ కోడి మాంసం మార్కెట్‌లో అందుబాటులోకి వచ్చింది. ధర ఎక్కువైనా మంచి విలువలతోపాటు రుచికరమైనది. ఇందులో కొవ్వు తక్కువ రుచ్చి ఎక్కువ. ఔషధ గుణాలతో ఆరోగ్యానికి మేలు చేసే ఈ మాంసాన్ని భుజించేందుకు ప్రజలకు మక్కువ చూపుతున్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో కూడా కడక్‌నాథ్ కోళ్ల పెంపకం పెరుగుతోంది.

– పాలసముద్రం

- విరివిగా కడక్‌నాథ్ కోళ్ల పెంపకం
- కొవ్వు తక్కువ.. రుచి ఎక్కువ



మహదేవపురం ఫారంలో పెరుగుతున్న కడక్‌నాథ్ కోళ్లు

కడక్‌నాథ్ కోడి కథ

కడక్‌నాథ్ రకానికి చెందిన కోళ్లు మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గడ్ రాష్ట్రాల్లోని గిరిజన ప్రాంతాల్లో ఎక్కువగా పెరుగుతాయి. సాధారణంగా నాటు కోళ్లు వివిధ రంగుల్లో ఉంటాయి. కడక్‌నాథ్ కోళ్లు వాటికి భిన్నంగా ఈకలే కాదు శరీరం కూడా నలుపు రంగులో ఉంటాయి. మెలనిన్ అనే హార్మోన్ కారణంగా ఈ కోళ్లు నలుపు రంగులో ఉంటాయి. సాధారణ కోడి మాంసంతో పోలిస్తే కడక్‌నాథ్ కోడి మాంసంలో కొవ్వు శాతం చాలా తక్కువ, రుచి మాత్రం బాగుంటుంది. ఈ కారణంగా మాంసాహార ప్రియులు ఈ కోళ్లను ఇష్టపడుతున్నారు. ఈ కోళ్ల మాంసానికి మార్కెట్‌లో, చికెన్ సెంటర్లలో డిమాండ్ పెరిగింది. కిలో మాంసం ధర రూ.500 పైనే.

పోషక విలువలు ఎక్కువ

ధర ఎక్కువైనా మార్కెట్ కడక్‌నాథ్ మాంసానికి అధిక డిమాండ్ ఉండడానికి కారణం పోషక విలువలే. కొలెస్ట్రాల్ శాతం తక్కువగా ఉండడంతో పాటు ప్రొటీన్, ఐరన్ శాతం ఎక్కువగా ఉంటుంది. ఈ కోడి గుడ్డులో సైతం అత్యధిక ప్రొటీన్లతోపాటు లినోలెయిక్ యాసిడ్స్ ఉంటాయి. ముఖ్యంగా ఈ కోళ్లకు వ్యాధి నిరోధక శక్తి ఎక్కువ. సాధారణంగా కోళ్లలో కనిపించే వ్యాధులు వీటి దరికి చేరవు.

ఎక్కడైనా బతుకుతాయి

కడక్‌నాథ్ కోళ్లు కేవలం ఉష్ణోగ్రత ఎక్కువగా ఉండే ప్రాంతాల్లోనే కాక అన్ని ప్రదేశాల్లోనూ జీవించగలవు. చిన్న చిన్న పురుగులతో కడుపు నింపుకోకుండా పోషక విలువలున్న ఆహారం తీసుకుంటాయి. కూరగాయలు, ఆకుకూరలు, రాగులు, సజ్జలు ఇలా వేటినైనా జీర్ణించుకోగలవు. ఇన్ని ప్రత్యేకతలున్న కడక్‌నాథ్ కోళ్లు రైతులకు అధిక లాభాలను తెచ్చిపెడుతున్నాయి. ప్రస్తుతం పౌల్ట్రీ రంగంలో వీటికి డిమాండ్ అధికంగా ఉంది. అనేక మంది యువ రైతులు కడక్‌నాథ్ కోళ్ల ఫారాలు నిర్వహిస్తూ లాభాల బాటలో నడుస్తున్నారు. ఒక్కో కోడి నెలకు 12 నుంచి 20 కోడ్లు పెట్టడంతో తక్కువ సమయంలో ఎక్కువ పిల్లలు పెరిగి వ్యాపారం వృద్ధి చెందుతోందని రైతులు పేర్కొంటున్నారు.



ఫారంలో ఉన్న కడక్‌నాథ్ కోడి

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం మానేసి...



కడక్‌నాథ్ జాతి కోళ్లకు ప్రస్తుతం డిమాండ్ ఉంది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం మానేసి 250 కడక్‌నాథ్ కోడి పిల్లలతో ఫారం ఏర్పాటు చేశాను. నిర్వహణ వ్యయం పెద్దగా ఉండదు. ఆకుకూరలు, కూరగాయ ముక్కలు మూడు పూటలా ఉంటే చాలు. నాలుగు నెలల వ్యవధిలో కోడి మాంసానికి సిద్ధమవుతుంది. మార్కెట్‌లో డిమాండ్ ఎక్కువగా ఉండడంతో నా వ్యాపారం లాభాల బాటలో నడుస్తోంది. ప్రభుత్వం మరింత చేయూతనిస్తే మరింత వృద్ధి చెందుతుంది.

– ఎస్.రఘు, కడక్‌నాథ్ కోళ్ల ఫారం యజమాని, వెంగళరాజుకుప్పం

క్లుప్తంగా

పుస్తక పఠనంతో విజ్ఞానం



గ్రంథాలయం, సైన్స్, గణిత ప్రయోగశాల భవనాన్ని ప్రారంభిస్తున్న బాబురాజు, ఎంఈఓ

పాలసముద్రం: గ్రంథాలయంలోని కథల పుస్తకాలు చదవడంతో విద్యార్థులకు విజ్ఞానం పెంపొందుతుందని కేబీఆర్ ఫౌండేషన్ మెంబర్ బాబురాజు తెలిపారు. శనివారం తిరుమళరాజుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతన గ్రంథాలయం, సైన్స్, గణిత ప్రయోగశాల భవనం ప్రారంభించారు. చైర్మన్ సుందరరాజు లక్ష విలువ గల సైన్స్ పరికరాలు అందించారు. అనంతరం రిబ్బన్ కట్‌చేసి గ్రంథాలయం, సైన్స్, గణిత ప్రయోగశాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈఓ రాజేంద్రప్రసాద్, మాజీ జెడ్పీటీసీ చిట్టిబాబునాయుడు, గ్రామ పెద్దలు మోహన్‌రాజు, గంగరాజు, నాగరాజు, బాలరాజు, నరసరాజు తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 126 మంది ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులతో కంపెనీల ప్రతినిధులు

పుత్తూరు: స్థానిక ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మెగా జాబ్ మేళాలో 126 మంది ఎంపికైనట్లు కళాశాల వైస్ ప్రిన్సిపల్స్ వి.కోటేశ్వరయ్య, వి.వీరయ్య తెలిపారు. వారు మాట్లాడుతూ మేళాలో మొత్తం 165 మంది పాల్గొనగా వివిధ కంపెనీల ప్రతినిధులు 126 మందిని ఎంపిక చేసినట్లు వివరించారు. ఇందులో పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు 86 మంది ఉండడం సంతోషకరమన్నారు. జాబ్ మేళాలో ఎంపికైన వారికి పది కంపెనీల ప్రతినిధులు ధృవీకరణ పత్రాలను అందజేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ ఆఫీసర్ వి.బాబురావు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికే సదస్సులు



అత్తూరు రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్

నిండ్ర: మండలంలోని రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసమే సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శేషగిరి రావు అన్నారు. మండలంలోని అత్తూరులో శనివారం రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. గ్రామంలోని పలువురు రెవెన్యూ సమస్యలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. గ్రామంలో 36 వినతులు పరిష్కారం చేయాలని కోరారు. గతంలో జరిగిన రెవెన్యూ సభలో 582 అర్జీలు వచ్చినట్లు చెప్పారు. రెండో దశ సదస్సులో మండలంలో మొత్తం 386 సమస్యలపై అర్జీలు వచ్చాయన్నారు. వాటిని నిబంధనలను అనుసరించి పరిష్కరిస్తామని ఆయన అన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సు

శ్రీరంగరాజపురం: రైతులు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న భూసమస్యలను పరిష్కరించడానికి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ లోకనాథపిళ్లై అన్నారు. తయ్యూరు సర్పంచ్ వరదమ్మ అధ్యక్షతన చిన్నతయ్యూరు, 50 బసివిరెడ్డిపల్లి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ లోక నాథపిళ్లై మాట్లాడుతూ పొలం సరిహద్దులు, మ్యుటేషన్ భూసమస్యలను గుర్తించి వాటిని సామరస్యంగా పరిష్కరిస్తామన్నారు. అనంతరం రైతుల నుంచి వినతులు స్వీకరించారు. ఎంపీపీ సరిత, మండల సర్వేయర్ సురేష్, ఆర్ఐ ప్రభాకర్, కార్యదర్శి జ్యోత్స్న, రాజేంద్ర, జనార్ధన్, బాబు, లోకేష్, రమేష్, ఉమాపతి, గుండయ్య, దశరథ్, వెంకటేష్, చిరంజీవి, మధు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.


విజయ్‌కాంత్‌కు ఘన నివాళి



విజయ్‌కాంత్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అభిమానులు

నగరి : సినీనటుడు, డీఎండీకే పార్టీ వ్యవస్థాపకులు విజయ్‌కాంత్ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన అభిమానులు నివాళి అర్పించారు. మున్సిపల్ పరిధి కొత్తపేటలో విజయ్‌కాంత్ చిత్రపటాన్ని ఏర్పాటుచేసి పుష్పాలతోనూ, విద్యుత్ దీపాలతోనూ అలంకరించి పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. వర్ధంతిని పురస్కరించుకొని విజయ్‌కాంత్ చిత్రాల్లోని పాటలు ఈ ప్రాంతంలో మార్మోగాయి.

ఘనంగా శ్రీఅయ్యప్ప స్వామి ఊరేగింపు



కార్వేటినగరం: మేజర్ పంచాయతీ కార్వేటినగరంలో మండపం వీధిలో వెలసి ఉన్న శ్రీఅయ్యప్ప స్వామి శనివారం గ్రామ వీధుల్లో అంగరంగ వైభవంగా ఊరేగారు. ఈ సందర్భంగా అయ్యప్ప మాలధారణ భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు. అనంతరం స్వామివారిని పట్టు వస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో సుదరంగా అలంకరించి ప్రత్యేక వాహనంపై ప్రతిష్టించారు. మంగళవాయిద్యాల నడుమ ఊరేగించారు. భక్తులు ఇంటింటా కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారిని దర్శించుకున్నవారికి అయ్యప్ప స్వాములు అన్నప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో కుమారస్వామి ఆచారి, నీలకంఠరెడ్డి, ధనశేఖర్‌యాదవ్, ధనశేఖర్ మొదలియార్, సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

సాగుకు సన్నద్ధం



కాళికాపురంలో వరి నారు సిద్ధం చేస్తున్న కూలీలు

విజయపురం : ఇటీవల కురిసిన వర్షాలకు చెరువు, గుంటల్లో నీరు చేరాయి. భూగర్భ జలాలు పెరగడంతో రైతులు వరి సాగుకు సిద్ధమవుతున్నారు. కొంత మంది నారు సిద్ధం చేసుకోవడంలో రైతులు బిజీబిజీగా ఉన్నారు. ఇప్పటికే మండలంలో సుమారు 220 హెక్టార్లలో వరి సాగవుతోంది. మరో 100 హెక్టార్లలో వరి సాగుకు రైతులు సిద్ధమవుతున్నారని అధికారులు తెలిపారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన అవసరం





జూనియర్ లాయర్స్‌కు అవగాహన కల్పిస్తున్న జడ్జి, కళాశాలలో ప్రసంగిస్తున్న న్యాయమూర్తి రామ్‌గోపాల్

నగరి : విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగివుండాలని తిరుపతి 5వ ఏడీజే కోర్టు జడ్జి రామ్‌గోపాల్ అన్నారు. నగరి కోర్టును శనివారం ఆయన తనిఖీ చేసి, వసతులపై ఆరాతీశారు. అనంతరం నగరి జూనియర్ సివిల్ మేజిస్ట్రేట్ విష్ణువర్మతో కలిసి జూనియర్ లాయర్స్‌కు, కోర్టు సిబ్బందికి కోర్టు విధులకు సంబంధిత అవగాహన ఏర్పరిచారు. అనంతరం స్థానిక పీసీఎన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యాహక్కుల చట్టాన్ని వివరించారు. వాహనాలు నడిపే సమయంలోనూ విద్యార్థులు చట్టాలను అనుసరించాలని సూచించారు. విద్యార్థి దశ నుంచి చట్టాలను అనుసరించడం నేర్చుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎంజె జగదీశన్, ఉపాధ్యక్షులు ఈజీ బాబు, సీనియర్ న్యాయవాదులు సుబ్రమణ్యం రెడ్డి, సోమసుందరం, ఉదయభాను, సీఐ మహేశ్వర్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

దార్శనికుడు మన్మోహన్‌సింగ్



మన్మోహన్‌సింగ్‌కు నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

నగరి : ఆర్థికాభివృద్ధికి దారి చూపిన దార్శనికుడు మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ అని పీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి ఆర్.బాబు అన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద శనివారం మన్మోహన్ సింగ్ చిత్రపటాన్ని ఉంచి పూజలు చేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ పదేళ్ల దేశ ప్రధానిగా అనేక ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చి భారత దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన ధీశాలి మన్మోహన్‌సింగ్ అన్నారు. మూడు కోట్ల మంది చిన్న, సన్నకారు రైతులకు రూ.72 వేల కోట్ల రుణమాఫీ చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఉపాధి హామీ పథకం, సమాచార హక్కు చట్టం, విద్యాహక్కు చట్టం, ఆహార భద్రత చట్టం తీసుకొచ్చిన అపర మేధావి అన్నారు. తన ఆర్థిక సంస్కరణలతో దేశాన్ని ముందుకు నడిపిన ధీరోదత్తుడు నేడు దూరంకావడం దేశానికే తీరనిలోటన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు నటరాజ మొదలియార్, డీసీసీ ప్రధాన కార్యదర్శి దేశయ్య, నాయకులు చిరంజీవి రెడ్డి, నాగేశ్వరరావు, కుమార్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శని త్రయోదశి పూజలు





శని హోమం నిర్వహిస్తున్న అర్చకులు, శని భగవానుడికి తైలాభిషేకం

గంగాధరనెల్లూరు: మండలంలోని శ్రీసంతాన వేణుగోపాల స్వామి ఆలయంలో శని త్రయోదశి సందర్భంగా శని దేవుడికి అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. శని త్రయోదశి సందర్భంగా శనేశ్వర ఆలయంలో ఆలయ అర్చకుడు రుషికేశవ ఆధ్వర్యంలో శని భగవానుడికి తైలాభిషేకాలు, విశేషాభిషేకాలు, శని హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి వివిధ ప్రాంతాల నుండి భక్తులు పోటెత్తారు. ఆలయం ఆవరణలో శని భగవానునికి ప్రీతిపాత్రమైన నల్ల నువ్వుల దీపాలు వెలిగించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

వేడుకగా శని త్రయోదశి పూజలు

నగరి : పట్టణ పరిధిలోని శ్రీ కామాక్షి సమేత శ్రీ కరకంటేశ్వర స్వామి ఆలయంలో శనిత్రయోదశి, నంది ప్రదోష వేడుకలు శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం శని త్రయోదశి పూజలు నిర్వహించి శని భగవానుడికి, పరివార దేవతలకు అభిషేకాలు అలంకరణలో చేశారు. శనివారం వచ్చిన శని త్రయోదశి కావడంతో ప్రత్యేకతను సంతరించుకుంది. సాయంత్రం నంది ప్రదోష పూజల్లో భాగంగా ఆలయంలోని నంది విగ్రహానికి ప్రత్యేక అభిషేకాలు అలంకరణలు చేశారు. కామాక్షి సమేత కరంటేశ్వర స్వామిని నంది వాహనంపై ఆలయ ప్రదక్షిణలు చేశారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.





నందీశ్వరునికి అభిషేకం చేస్తున్న అర్చకులు, పూజలకు హాజరైన భక్తులు

ఎస్సీ కుల గణనపై అభ్యంతరాల స్వీకరణ



ఎంపీడీవో హరిప్రసాద్ రెడ్డి

గంగాధరనెల్లూరు: మండలంలో ఎస్సీ కులగణనపై అభ్యంతరాలను స్వీకరించనున్నట్లు గంగాధరనెల్లూరు ఎంపీడీఓ హరిప్రసాదరెడ్డి తెలిపారు. ఎస్సీ కుల గణన, సోషల్ ఆడిట్ నిర్వహణ, అభ్యంతరాల స్వీకరణ ఇతర అంశాలను ఈ నెల 31 వరకు మండల పరిధిలోని గ్రామ సచివాలయాల్లో ప్రదర్శించి అభ్యంతరాలు స్వీకరిస్తారని తెలిపారు. జనవరి 1వ తేదీ నుండి ఆరో తేదీ వరకు అభ్యంతరాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారని తెలిపారు. కుల గణనపై మూడు దశల్లో తనిఖీలు ఉంటాయన్నారు. పేరు, ఆధార్ నెంబర్, పుట్టిన తేదీ, వయస్సు, ఉప కులం తదితర వివరాలను సచివాలయాల్లో ప్రదర్శిస్తారని వివరించారు. పౌరుల నుంచి వచ్చిన అభ్యంతరాలను వీఆర్‌ఓలు పరిశీలించి ఆర్ఐకి నివేదిస్తారని తెలిపారు. అక్కడి నుంచి తహసీల్దార్‌కు పంపి తుది ఆమోదంతో వివరాలను భద్రపరుస్తారని పేర్కొన్నారు. ప్రక్రియ అనంతరం సోషల్ ఆడిట్‌ను జిల్లా కలెక్టర్, ఆర్డీఓలు పర్యవేక్షిస్తారని హరిప్రసాద్‌రెడ్డి వివరించారు.

నీడ లేని నిరీక్షణ

జిల్లాలోనే రెండవ అతిపెద్ద విద్యా కేంద్రంగా పేరున్న పుత్తూరు పట్టణంలో అతి పెద్ద ఆర్టీసీ డిపో ఉంది. ఇలా రెండు అంశాల్లో పేరు గాంచిన పట్టణంలో ప్రయాణికుల అవస్థలు వర్ణనాతీతం. పట్టణంలో పేరు గాంచిన బస్టాపుల్లో బస్‌షెల్టర్లే లేకపోవడం విశేషం. ఐదు దశాబ్దాల పాటు నియోజకవర్గ కేంద్రంగా బాసిల్లిన పుత్తూరు పట్టణ దుస్థితి ఇది. ప్రభుత్వాలు మారినా, నాయకులు మారినా తమ అవస్థల ప్రయాణం తీరు మారడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు.

- 4 చోట్ల కానరాని బస్ షెల్టర్లు
- ఎండకూ, వానకూ ప్రయాణికుల అవస్థలు
- బస్టాపుల్లో కనపడని కుర్చీలు



షెల్టర్ లేక రోడ్డుపైనే బస్సు కోసం నిరీక్షిస్తున్న విద్యార్థులు

పుత్తూరు: పట్టణంలో ఆర్డీఎం గేటు, ఆర్టీసీ బస్టాండు, నగరం రోడ్డు, పెట్రోల్ బంకు అంటూ నాలుగు బస్టాపుల పేర్లు వినిపిస్తాయి. అయితే ఏ ఒక్క బస్టాపులోనూ బస్‌షెల్టర్ లేక ప్రయాణికులు బస్సుల కోసం రోడ్లపై నిలబడి నిరీక్షించాల్సిందే. ఈ దుస్థితిని పట్టించుకునేవారే లేకపోవడం శోచనీయం. పుత్తూరు పట్టణ జనాభా 60 వేల కంటే ఎక్కువగా ఉంది. పలు విద్యా సంస్థలకు నెలవైన పుత్తూరు పట్టణంలో పలు ఇంజినీరింగ్ కళాశాలలు, డీఎడ్, నర్సింగ్, లా కళాశాలలు, డిగ్రీ, జూనియర్ కళాశాలలతో పాటు పలు పాఠశాలలు ఉన్నాయి. ప్రతి రోజూ వేల సంఖ్యలో విద్యార్థులు వచ్చి వెళుతుంటారు.

గంటల తరబడి నిరీక్షణ

తిరుపతి, తిరుత్తణి, సత్యవేడు, చిత్తూరుకు నడిబొడ్డులో ఉన్న పుత్తూరు పట్టణానికి వ్యాపారపరంగా, ఉద్యోగులు, విద్యార్థులు ప్రతిరోజూ బస్సుల ద్వారా రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో ప్రయాణికుల రద్దీ ఎంతగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఇందుకు తగ్గట్టుగా పుత్తూరు పట్టణంలోని రైల్వే గేట్ల కారణంగా బస్సులు పట్టణంలోకి వచ్చేందుకు చాలా ఆలస్యం అవుతూ ఉంటుంది. ఒక్కోసారి బస్సు ఎక్కేందుకు కనీసం గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలో బస్సుల కోసం వేచి ఉండేందుకు బస్ షెల్టర్లు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిలబడేందుకు నీడ లేక, కూర్చోవడానికి చోటు లేక ఇబ్బందులు పడుతున్నారు. పిల్లలను ఎత్తుకొచ్చేవారు, ముసలి ముతక వారి పరిస్థితి చెప్పనవసరం లేదు. ఎండకు ఎండాల్సిందే, వర్షం వస్తే అటూ ఇటూ పరుగెత్తాల్సిందే. ఇంతగా అవస్థలు పడుతున్న ప్రయాణికుల గురించి ప్రజాప్రతినిధులు గానీ, అధికారులు గానీ పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్థానిక పెట్రోల్ బంకు, అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఉన్న మున్సిపల్ బస్‌షెల్టర్లు రెండూ నగరి వైపు రోడ్డుపై ఉండడంతో అవి నిరుపయోగంగా ఉన్నాయి. తిరుపతి వైపు రోడ్డుపై పట్టణంలో అవసరమైన ప్రతి చోట బస్ షెల్టర్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



నగరం రోడ్డు వద్ద ప్రయాణికుల పాట్లు

బస్సు షెల్టర్లు నిర్మించాలి



మున్సిపాలిటీ కేంద్రంగా ఉన్న పుత్తూరులో బస్ షెల్టర్లు లేకపోవడం దారుణం. బస్సుల కోసం అనునిత్యం ప్రయాణికులు గంటల తరబడి నిరీక్షించాల్సి రావడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం. ఇకనైనా అధికారులు స్పందించి బస్ షెల్టర్లు ఏర్పాటు చేయాలి.

– ఎ.పళణి, మదర్ ఆగ్నేస్ సోషల్ సర్వీస్, ఎన్టీఓ కాలనీ, పుత్తూరు

వానకు తడుస్తున్నాం



ప్రతి రోజూ తిరుపతి, పుత్తూరుకు తిరుగాడే మాలాంటి ప్రయాణికులు బస్ షెల్టర్లు లేకపోవడంతో ఎండకు ఎండుతూ, వానకు తడుస్తున్నారు. అంగళ్ల ముందు బస్సుల కోసం నిరీక్షించాల్సి వస్తోంది. బస్ షెల్టర్లు ఏర్పాటు చేసి అవస్థలకు స్వస్తి పలకండి.

– కె.పాండ్రంగం, పుత్తూరు

నిధులు మంజూరైతే స్థలం చూపిస్తాం



పుత్తూరు పట్టణంలో బస్ షెల్టర్లు లేక ప్రయాణికుల అవస్థలు నిజమే. ప్రస్తుతానికి మున్సిపల్ నిధుల నుంచి బస్ షెల్టర్లు నిర్మించడానికి అవకాశం లేదు. నిధులు మంజూరైతే టౌన్ ప్లానింగ్ అధికారితో సర్వే చేసి, స్థలాలను ఏర్పాటు చేయగలం.

– ఎం.మంజునాథ్ గౌడ్, మున్సిపల్ కమిషనర్, పుత్తూరు

ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శన



ఆవిష్కరణలు పరిశీలిస్తున్న ఎంఈవో

నగరి : పట్టణ పరిధి పీసీఎన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులు తమ ప్రతిభను కనభరిచారు. పార్కులు, భవనాలు, లైట్ హౌస్‌లు, ట్రాఫిక్ సిగ్నల్స్ అంటూ విద్యార్థులు సిద్ధం చేసుకుని వచ్చి ప్రదర్శించిన తీరు అందరినీ ఆకట్టుకుంది. ఈ సైన్స్‌ఫేర్‌ను ఎంఈవో శ్రీదేవి పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్యామలాదేవితో కలిసి ప్రారంభించారు. విద్యార్థుల ప్రదర్శనలు పరిశీలించి వారిని వివరాలు అడిగి వారిలోని విజ్ఞాన చతురతను ఆరాతీశారు. ఎంఈవో మాట్లాడుతూ వైజ్ఞానిక ప్రదర్శనలో తమ ఆవిష్కరణలను ప్రదర్శించిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థులంతా చదువుతోపాటు అన్ని రంగాల్లో నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. సైన్స్ ఫెయిర్ ముఖ్య ఉద్దేశం కేవలం అంశాలను ప్రదర్శించడమే కాదని వాటిని ప్రయోగాత్మకంగా నిరూపించగలిగే స్థితిలో ఉండాలన్నారు. భారతదేశానికి భవిష్యత్తు పిల్లలు కాబట్టి వారికి చదువుతోపాటు విజ్ఞానాన్ని అందించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. మొక్క ఏ విధంగా ఆటంకాలు ఎదుర్కొంటూ పైకి వస్తుందో విద్యార్థులు కూడా అదే లక్ష్యంతో ముందుకు రావాలన్నారు. వైజ్ఞానిక ప్రదర్శనలో ఉత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.